పోలీసులకు సేవా పతకాలు

శ్రీకాకుళంక్రైం, మార్చి 21: రాష్ట్ర ప్రభుత్వం పలువురు పోలీసులకు గురువారం సేవా పతకాలను ప్రకటించింది. కళింగపట్నం సీఎస్‌పీఎస్ ఏఎస్ఐ బీజే మోహన్‌రావుకు ఉత్తమ సేవా పతకం వరించింది. ఎచ్చెర్లలోని డీఏఆర్ విభాగంలో ఏఆర్ హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సద్గుణమూర్తి, ఎచ్చెర్ల ఏఎస్ఐ పీవీ రమణ, కొత్తూరు స్టేషన్ కానిస్టేబుల్ సీహెచ్ పాపారావు సేవా పతకాలకు ఎంపికయ్యారు. అలాగే శ్రీకాకుళం అగ్నిమాపక శాఖలో పని చేస్తున్న లీడింగ్ ఫైర్‌మ్యాన్ గురుగుబెల్లి రాజశేఖర్‌కు సేవాపతకం వరించింది. వీరికి ఉగాది నాడు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

హామీ ఏమైంది జగనన్నా

- వేతనాల పెంపు ఎప్పుడు?
- చాలీచాలని జీతాలతో అవస్థలు
- తప్పని యాజమాన్య వేధింపులు
- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల కష్టాలు



శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో నిలిపి ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

> తాము అధికారంలోకి వస్తే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన సీఎం జగన్ మాట తప్పారు. ఐదేళ్లవుతున్నా వారిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఒకపక్క వేతనాలు పెరగక, మరోపక్క అదనపు పనిభారంతో సతమతవుతున్నారు. వేతనాలు సైతం సక్రమంగా చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శ్రీకాకుళం క్రైం, మార్చి 21: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్ల జీవితాలు దుర్భరంగా మారాయి. చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఏళ్ల తరబడి వేతనాలు పెరగకపోవడంతో అవస్థలు పడుతున్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో 15 వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. ప్రతీ వాహనానికి ఓ డ్రైవర్‌ను నియమించి రూ.8,800 వేతనం అందించారు. అయితే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ వేతనాలు పెంచడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. వేతనాలు పెంచాలని 2018లో అప్పటి ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నారు. అయితే, ఎన్నికల తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో వారి అర్జీని పట్టించుకున్న వారు కరువయ్యారు.

హామీని మరచిన జగన్

జిల్లాలో పాదయాత్ర సమయంలో సీఎం జగన్మోహన్‌రెడ్డిని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు కలిసి తమ వేతనాలు పెంచాలని మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన జగన్ అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. అయితే ఐదేళ్లవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 18 వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాల నిర్వాహణ, డ్రైవర్ల వేతనాలను అరబిందో కంపెనీ చూసుకుంటుంది. అయితే, అత్యవసర సమయంలో కొన్నిసార్లు వాహనాల సిగ్నల్స్ దాటి వెళ్లే క్రమంలో పోలీసులు విధించే జరిమానాతో పాటు వాహనాల మరమ్మతుల ఖర్చులు కూడా తామే భరిస్తున్నామని డ్రైవర్లు వాపోతున్నారు. ఐరెన్ సుక్రోస్ పేరుతో రక్తం తక్కువ ఉన్న గర్భిణులు, బాలింతలకు ఇంజక్షన్లు చేయించడానికి జిల్లా వ్యాప్తంగా వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లే అదనపు బాధ్యతలు కూడా వీరికే అప్పగించారు. గతంలో ఈ పనిని 108 సిబ్బంది నిర్వహించే వారని, ఇప్పుడు ఆ బాధ్యతను తమకు అప్పగించి పనిభారం పెంచారే తప్ప వేతనం పెంచలేదని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు, డీఎంహెచ్‌వోకు స్పందన కార్యక్రమంలో మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులను కలిసిన డ్రైవర్లను యాజమాన్యం వేధింపులకు గురిచేస్తుందని ఆరోపిస్తున్నారు.



వేతనాలు పెంచాలంటూ కష్టాలు చెప్పుకుంటున్న డ్రైవర్లు

అందని వేతనం

ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతనం ఇంత వరకు తమకు అందలేదని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. రూ.8,800 వేతనంలో కటింగ్‌లు పోను రూ.7,870 చేతికి అందుతుందని, ఇందులో వాహన మరమ్మతులకు రూ.వెయ్యి ఖర్చు అవుతుందని వాపోతున్నారు. మిగిలిన రూ.7 వేలతో కుటుంబాలను ఈడ్చుకొస్తున్నట్లు చెబుతున్నారు. దీనికి తోడు సమయానికి జీతాలు పడడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు సమాన పనికి సమాన వేతనం వర్తింపజేయాలని కోరుతున్నారు.



టెక్కలి మండలం మేఘవరం నుంచి టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

మేమంతా 'కింజరాపు' వెంటే

- వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 175 కుటుంబాలు
- ఆహ్వానించిన అచ్చెన్నాయుడు

టెక్కలి, మార్చి 21: 'పగలు, ప్రతీకారాలతో నిండివున్న వైసీపీలో మేము ఉండలేం. ప్రజలకు దగ్గరగా ఉంటూ సేవచేసే కింజరాపు కుటుంబం వెంటే నడుస్తాం' అని టెక్కలి నియోజకవర్గంలోని పలు కుటుంబాలు తెలిపాయి. ఈ మేరకు గురువారం 175 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టెక్కలి మండలం మేఘవరం పంచాయతీకి చెందిన ఏదూరు శంకరరెడ్డి, నందిగాం కర్రెన్న, దల్లి ఎర్రయ్య, జలుమూరు ధనుంజయ, నాగరాజు, ముద్దాడ కృష్ణ, జలుమూరు పార్వతి, దల్లి అజయ్, మక్క చామంతి, బలరాంతో పాటు 50 కుటుంబాలు, సంతబొమ్మాళి మండలం లింగూడు పంచాయతీ ఎం.సున్నాపల్లి గ్రామానికి చెందిన మైలపల్లి గోవర్ధన, టి.ఎర్రన్న, ఎ.వెంకట్రావు, ఎస్.రామారావు, మోస నారాయణ, ఎర్రన్న, బైపల్లి ధనరాజ్, చెక్కా కాంతారావు, వంకా శేఖర్, ఎస్.రాంబాబు, దూర్వాసులు, రాజేంద్రకుమార్, గురునాధరావు, గీతాగణపతి, సింహాచలం, గన్నయ్య తదితర 100 కుటుంబాలు, టెక్కలి మండలం తొలుసూరుపల్లికి చెందిన మాజీసర్పంచ్ గూన గోపాల్, పర్రి కృష్ణారావు, చింతాడ రేవతి, గూన అశోక్, హనుమంతు ఆనంద్, బమ్మిడి కిషోర్, శిష్ట ప్రభాకర్, మన్మధరావు, చిట్టయ్య క్రిష్ణారావు, నాగభూషన్, గౌరీపతి తదితర 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. సంతబొమ్మాళి మండలం పాతమేఘవరం గ్రామానికి చెందిన సాహుకారి కుమార్ కూడా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం ఖాయమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి నిలువనీడ లేకుండా చేసిందన్నారు. బావితరాల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంటికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, సంతబొమ్మాళి మండలాల టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరి, జీరు భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖర్చులు భరించడం ఎలా?

- ఎన్నికల పోలింగ్‌కు మరో 53 రోజులు
- అప్పటి వరకూ భారీగా ఖర్చు చేయాల్సిందే
- ఆందోళనలో అభ్యర్థులు



(టెక్కలి)

ఎన్నికల షెడ్యూల్ రావడంతో జిల్లాలో సందడి నెలకొంది. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి వైసీపీ తమ అభ్యర్థులను ఇప్పటికే ఖరారు చేసింది. టీడీపీ కూటమి నాలుగు చోట్ల అభ్యర్థులను ప్రకటించగా, మరో నాలుగుచోట్ల ప్రకటించాల్సి ఉంది. అయితే, ఈసారి ఎన్నికల పోలింగ్ తేదీ (మే 13) చాలా దూరం ఉండడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. మరో 53 రోజులు ఉండడంతో 'అమ్మో.. అన్ని రోజులా' అని అభ్యర్థులు కలవరపడుతున్నారు. ఇప్పటి నుంచి పోలింగ్ నాటి వరకు ఖర్చులు ఎలా భరించాలో అంటూ తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులకు ఉదయం అల్పాహారం మొదలుకొని మధ్యాహ్నం బిర్యానీ, రాత్రి దాబాల భోజనం, మందు, శీతల పానీయాలు, టీలు, వాహనాలు, డీజేలు, ఫ్లెక్సీలు ఇలా అన్నిరకాల ఖర్చులను అభ్యర్థులు భరించాల్సి ఉంటుంది. ప్రతి రోజూ కనీసం రూ.ఐదు లక్షల నుంచి సభలు, ఇతరత్రా కార్యక్రమాలను బట్టి పాతిక ముప్పై లక్షల వరకూ ఖర్చు పెట్టక తప్పని పరిస్థితి. అలా చెయ్యకపోతే వెంట నడిచేవారు కూడా జారిపోతారని భయం. గతంలో నలభై రోజులు లోపలే ఎన్నికల ప్రక్రియ అంతా జరిగేది. దీనివల్ల అభ్యర్థులకు టెన్షన్ ఉండేది కాదు. ఈసారి ఎన్నికల ప్రక్రియ కాస్త దూరంగా ఉండడంతో ఖర్చులు రెట్టింపు అవుతాయనే ఆందోళన కనిపిస్తుంది. నామినేషన్ల ఘట్టం, ఎన్నికల ప్రచారం, ముఖ్యనేతల బహిరంగసభలు ఇలా ఒక్కొక్కటి గట్టెక్కి రావడానికి భారీగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి.



పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం

- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ



మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

శ్రీకాకుళంక్రైం, మార్చి 21: రానున్న సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ అన్నారు. జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణపై గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో డీఐజీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం వాహనాలు తనిఖీలు నిర్వహించి మద్యం, గంజాయి, సారా, డబ్బులు, ఇతర బహుమతుల రవాణాను అరికట్టాలని ఆదేశించారు. 'ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రతీఒక్క పోలీసుకు అవగాహన ఉండాలి. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి. కేంద్ర, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఇచ్చే సూచనలు, నియమాలు తూచా తప్పకుండా పాటించాలి. ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు చోటులేకుండా పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా 3,624 మందిని బైండోవర్ చేశాం. జిల్లాలో ఇప్పటికే 7 అంతరాష్ట్ర, 4జిల్లా సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. రేంజ్ పరిధిలోని 40 చెక్ పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించి మద్యం, గంజాయి రవాణకు అవకాశం లేకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై 38 కేసులు నమోదు చేసి 1000 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నాం. శ్రీకాకుళంజిల్లా పరిధిలో రూ.84 లక్షల విలువైన మద్యం, గంజాయి సీజ్ చేశాం. రేంజ్ పరిధిలో 103 ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు, 100 ఎస్ఎస్‌టీ, 25 క్యూఆర్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. శ్రీకాకుళం జిల్లాలో 24 ఎఫ్ఎస్‌టీ, 24 ఎస్ఎస్‌టీ టీమ్‌లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 183 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించాం. ఆ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలు మోహరించాయి. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో చేసే అవాస్తవ ప్రచారాలు, ట్రోలింగ్లను తీవ్రంగా పరిగణిస్తాం. వాటిపై ప్రత్యేకంగా నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాం.' అని డీఐజీ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక, ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, సెబ్ ఏఎస్పీ డి.గంగాధరమ్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

- ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే కారణం

కలెక్టరేట్/హరిపురం, మార్చి 21: మందస మండలం భోగాపురం పంచాయతీకి చెందిన ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకుడు(ఫీల్డ్ అసిస్టెంట్) అగ్గున్న దేవేంద్రను విధుల నుంచి తొలగించినట్లు డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు తెలిపారు. దేవేంద్ర రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఫిర్యాదు రావడంతో పలాస ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ విచారణ చేపట్టారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో దేవేంద్రను విధుల నుంచి తప్పించినట్లు గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వలంటీర్లతో ఓటరు గుర్తింపు ప్రక్రియ

- ఇల్లు అద్దెకు తీసుకుని నిర్వహణ
- ఆరా తీసిన పోలీసులు

టెక్కలి, మార్చి 21: టెక్కలిలో వైసీపీ నాయకులు బరితెగించారు. టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అందులో కొంతమంది వలంటీర్లను ఉంచి గుట్టుచప్పుడు కాకుండా ఓటర్ల జాబితా పరిశీలన చేయిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై గురువారం సాయంత్రం పోలీసులు పరిశీలన చేసి ఆరా తీసినట్లు సమాచారం. దీనిపై పోలీసులు స్థానికులను విచారణ చేసినట్లు భోగట్టా. పట్టణానికి చెందిన కొంత మంది వైసీపీ నాయకుల కనుసన్నల్లో ఈ శిబిరం కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలోని వలంటీర్లపై అనధికారికంగా ఒత్తిడి తీసుకువచ్చి వారితో ఓటర్ల జాబితా పరిశీలన చేయించి ఓటర్ల పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో కొందరు వైసీపీ నాయకులు మిన్నకుండిపోయారు. పోలీసుల రాకను పసిగట్టిన వలంటీర్లు అక్కడ నుండి ఉడాయించినట్లు సమాచారం. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఈ శిబిరం గుట్టుగా సాగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేపడితే తెరవెనుక ఉన్న నాయకులు, వ్యక్తులు వివరాలు బయటపడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై సీఐ పి.షైడయ్య వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారం లేదని, ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎన్నికల కోడ్ పట్టదా?

- ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫొటోలు దర్శనం
- తొలగించని అధికారులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు, సిబ్బంది అంతగా దృష్టిసారించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నిచోట్లా ప్రజాప్రతినిధుల ఫొటోలు, బ్యానర్లు పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే సీఎం ఫొటోలు దర్శనమిస్తున్నాయంటే కోడ్ ఎలా అమలు అవుతుందో అర్థంచేసుకోవచ్చు. కలెక్టరేట్‌లో కీలక విభాగమైన సీఎఫ్‌జీహెచ్‌జే బ్యాక్‌లో తలుపుపై ఓ ఉద్యోగ సంఘానికి సంబంధించిన పోస్టర్ అతికించి ఉంది. ఆ పోస్టర్‌పై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రం ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఇంతవరకు ఆ పోస్టర్‌ను తొలగించలేదు. నిత్యం వేలాదిమంది భక్తులు దర్శనం చేసుకునే అరసవల్లి శ్రీసూర్యభగవానుడి ఆలయంలోని ప్రసాదాల విక్రయ కేంద్రం వద్ద కూడా సీఎం ఫొటో దర్శనమిస్తుంది. గతేడాది జరిగిన రాజశ్యామల మహాయజ్ఞంకు సంబంధించి సీఎం ఫొటోతో ఉన్న పోస్టర్‌ను ఇక్కడ అతికించారు. కోడ్ అమలులోకి వచ్చినా ఆ పోస్టర్‌ను మాత్రం తొలగించలేదు. అలాగే, ఖాజీపేట గ్రామం వద్ద సీఎం బొమ్మతో ఉన్న ప్రచార బోర్డును కూడా తొలగించకుండా వదిలేశారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలంటే ప్రజాప్రతినిధులకు చెందిన ప్రచార ఆర్భాటాలు, వారి ఫొటోలు, పోస్టర్‌లను అంతటా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



అరసవల్లి ఆదిత్యుని ఆలయం వద్ద సీఎం ఫొటోతో పోస్టరు



ఖాజీపేట గ్రామ పంచాయతీ బోర్డులో..



కలెక్టరేట్‌లోని సీఎఫ్‌జీహెచ్‌జే విభాగంలో పోస్టర్

వైసీపీ ప్రచారంలో రేషన్ డీలర్

హరిపురం, మార్చి 21: మందస మండలం నారాయణపురంలో గురువారం వైసీపీ నాయకులు చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆ గ్రామ రేషన్ డీలర్ గొరకల పవన్‌కుమార్ ఉరఫ్ పోలయ్య పాల్గొన్నారు. వైసీపీ సర్పంచ్, ఎంపీటీసీతో కలసి పవన్‌కుమార్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు.



వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పవన్‌కుమార్ (వృత్తంలో)

రైల్వే ప్రయాణికులపై కందిరీగల దాడి

- 40 మందికి గాయాలు
- హరిపురం రైల్వేస్టేషన్‌లో ఘటన



స్టేషన్‌నుంచి పరుగులు తీస్తున్న ప్రయాణికులు

హరిపురం, మార్చి 21: మందస రోడ్ (హరిపురం) రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులపై గురువారం కందిరీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో సుమారు 40మందికి గాయాలయ్యాయి. విశాఖపట్నం వెళ్లేందుకు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ కోసం ప్రయాణికులు ప్లాట్‌ఫారంపై ఉన్న చెట్ల కింద ఉండగా పైనున్న కందిరీగలు ఒక్కసారిగా దాడిచేశాయి. దీంతో వారు భయంతో పరుగులు తీశారు. మరికొంతమంది స్టేషన్ గదుల్లోకి పారిపోయి తలుపులు వేసుకున్నారు. సుమారు 40మందికి గాయాలయ్యాయి. వీరిలో కొంతమంది హరిపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. తీవ్ర గాయాలైన వారు ప్రయాణాలు రద్దు చేసుకుని ఇంటికి వెళ్లిపోయారు. కాగా, గత సోమవారం ఇదే రైల్వే స్టేషన్‌లో అదేచోట కందిరీగలు దాడి చేయడంతో 35 మంది ప్రయాణికులు గాయపడ్డారు. మూడు రోజుల వ్యవధిలోనే మళ్లీ కందిరీగలు దాడి చేయడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి కందిరీగల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



గాయపడిన ప్రయాణికులు

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు పార్టీ క్యాడర్ పెద్ద సంఖ్యలో గ్రామాల్లో పర్యటిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

టీడీపీ హయాంలోనే తీరప్రాంత గ్రామాల అభివృద్ధి

సంతబొమ్మాళి: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తీరప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. గురువారం కొల్లిపాడులో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగహన కల్పించారు. కొల్లిపాడు గ్రామాన్ని కింజరాపు కుటుంబం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పశు వైద్యశాల, హైస్కూల్, తాగునీటి పథకంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, నేతలు దుపాన రమణా రెడ్డి, కర్రి రామిరెడ్డి, సూరాడ ధనరాజ్, సూరాడ రాయుడు, సువ్వారి ప్రసాద్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం

వజ్రపుకొత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం ఖాయమని టీడీపీ పూండి క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గురువారం పూండిలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని కోరారు. వైసీపీ పాలనలో రాష్ట్రప్రగతి 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తంచేశారు.

టీడీపీని ఆదరించండి

టెక్కలి: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. గురువారం మేజర్‌పంచాయతీ ఆది ఆంధ్రా వీధిలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేదల సంక్షేమంపై దృష్టి సారిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై ప్రచారం

నందిగాం: నర్సిపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు అవగాహన కలిగించారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ మాదిన లోకనాథం ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలు అందించి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఎం.బాల కృష్ణ, బి.గిరిబాబు, కె.విశ్వనాథం, ఎం.పద్మావతి, ఎస్.దామోదరరావు, ఎం.సింహాచలం, కె.ధర్మారావు, బి.బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి: కొల్లిపాడు అవగాహన కలిగిస్తున్న నేతలు

వైసీసీని సాగనంపుదాం

జలుమూరు (సారవకోట): రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. కుమ్మరిగుంట, వండానవలస, బైదలాపురం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కర్రి సింహాచలం, జంగం మురళీకృష్ణ, విజయ్‌కుమార్, ముద్ద భీమారావు, మొర్రి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.







టెక్కలి: ఆదిఆంధ్రావీధి, నందిగాం: నర్సిపురం జలుమూరు (సారవకోట): కుమ్మరిగుంట గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీ విజయం తథ్యం

- ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- ఉప్పరిపేట, అంబాజీపేట, నడగాం, చేనులవలస నుంచి టీడీపీలో చేరికలు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, సైకో పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ, టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి లోక్‌సభ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం మడపాం, బుచ్చిపేట, అంబాజీపేట, చేనుల వలస, ముషిడిగట్టు, లుకలాం, కేపీవలస, జల్లువలస, కామేశ్వరిపేట, నడగాం గ్రామాల్లో నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వంశధార నదిలో ఇసుకను బుక్కేసిన అధికార పార్టీ నాయకులను ఇంటికి పంపించాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి తనను, రమణమూర్తిని గెలిపించాలని కోరారు. బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారికి మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు.



టీడీపీలో చేరిన వారితో ఎంపీ రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, కార్యకర్తలు

ఉప్పరిపేట, అంబాజీపేట, నడగాం, చేనులవలస గ్రామాల నుంచి వందలాది మంది వైసీపీ కార్యకర్తలు, నేతలు టీడీపీలో చేరారు. నడగాంకు చెందిన సీనియర్ నాయకుడు గొట్టాపు చిన్నం నాయుడు, చేనుల వలస మాజీ సర్పంచ్ దుల్ల ఆనంద్ తదితరులకు ఎంపీ రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ బలగ ప్రవీణ్, టీడీపీ నాయుకులు శిమ్మ చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, ధర్మారావు, సుందరరావు, పూతి రమణ, కేఎల్ఎన్ ప్రసాదరావు, బీజేపీ, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోడ్ వర్తించదా?

(పలాస)



ఏహెచ్‌పీ గృహాలకు వైసీపీ రంగులు

చిత్రంలో చూస్తున్నారుగా ఇది జాతీయ రహదారి కోసంగిపురం రోడ్డులో టీడీపీ హయాంలో నిర్మించిన ఏఏహెచ్‌పి గృహాలు.. సుమారు 980 పూర్తయ్యాయి. అప్పటిలో ఎన్నికలకు ముందు ఒక ఇంటిని అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ ప్రారంభించారు. ఆ తరువాత ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రాగానే ఆ ఇళ్లకు వైసీపీ రంగులు వేసింది. ఈ ఇళ్లను తామే కట్టామని ప్రకటించుకున్నా నేటికీ లబ్ధిదారులకు అందించలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయినా ఈ ఇళ్లకు వేసిన వైసీపీ రంగులు తొలగించలేదు. వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అని పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఎక్కడా పార్టీల రంగులు, జెండాలు కనిపించ కూడదని ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చినా ఇక్కడ వాటిని అధికారులు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నందిగాంలో...

నందిగాం: ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసి కోడ్ అమలు చేయాలని ఆదేశించినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలువ ఇనిపిస్తున్నాయి. ఎంపీడీవో కార్యాలయంతో పాటు వెలుగు కార్యాలయం ఆవరణ, ఉన్నత పాఠశాల తదితర ప్రాంగణాల్లో శిలాఫలకాలను మూసివేయ లేదు. దీంతో కోడ్ వీటికి వర్తించదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పక్కాగా కోడ్ అమలుచేయాలని పలువురు కోరుతున్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న శిలాఫలకం

సుభలయి కాలనీలో...

హిరమండలం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు, సుభలయ ఆర్అర్ కాలనీలోని వాటర్ ట్యాంకుకు వైసీపీ రంగులు దర్శనమిస్తున్నాయి. వీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



సుభలయ ఆర్అర్ కాలనీలోని వాటర్ ట్యాంకుకు తొలగించని వైసీపీ రంగులు

సైకో పాలనను తరిమికొట్టాలి: అచ్చెన్న

టెక్కలి, మార్చి 21: సైకో పాలనను తరిమికొట్టి సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలసలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కొందరికే పథకాలు ఇచ్చారని, టీడీపీ అధికారంలోకి వస్తే అందరికీ ఇస్తామన్నారు. అవినీతి సీఎం జగన్ లక్షకోట్లు సంపాదించాడని, ఆ డబ్బులు ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం గా ఉన్నాడని, ఆ డబ్బులు తీసుకొని ఓటు మాత్రం సైకిల్‌కు వేయాలన్నారు. రేషన్ వాహనాలపై జగన్ బొమ్మ పెట్టుకొని నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారని, అవి కేంద్రంలో ప్రధాని మోదీ ఇచ్చిన బియ్యమని గుర్తుచేశారు. టీడీపీ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తే వైసీపీ పాలన అవినీతికి కేరాఫ్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయిన రమేష్, కింజరాపు హరిప్రసాద్, ఎన్.శ్రీనివాస్, వెలమల విజయలక్ష్మి, రామకృష్ణ, పూజారి శైలజ, కర్రి అప్పారావు, కామేసు పాల్గొన్నారు.



అక్కయ్యవలసలో ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు

గుణాత్మక విద్యను అందించాలి

జలుమూరు (సారవకోట): ప్రాథమిక స్థాయిలో గుణాత్మకమైన విద్యను అందించాలని ఎంఈవో ఎంవీరమణ అన్నారు. అలుదు ఉన్నత, వడ్డినవలస ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి నుంచే గ్రామాల్లోని బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా పనిచేయాలన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా భద్రతా చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

పాతపట్నం, మార్చి 21: ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం, వీవీటీం, అకౌంటింగ్ టీం గదులను తనిఖీ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆంధ్ర-ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైనందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఒడిశా నుంచి మద్యం, సారా, గంజాయి, డబ్బు అక్రమ తరలింపునకు అవకాశాలున్నందున వీటి నియంత్రణకు గట్టి నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్వో ఎం.అప్పారావు, తహసీల్దార్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలుండాలి

మెళియాపుట్టి: ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలుండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. గురువారం మండలంలోని ఆంధ్ర-ఒడిశా వసుంధర చెక్‌పోస్టుతో పాటు జలగ లింగుపురం, మెళియాపుట్టి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మెళియాపుట్టి కేంద్రంలో ఓట్లు వేసేందుకు సరిగా లేదని, తగు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకమ్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సంతబొమ్మాళి: మండలంలోని పోలింగ్ కేంద్రాలను టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. భావనపాడు, మర్రిపాడు, నౌపడ, పోతునాయుడు పేటతో పాటు 11 పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్‌కు అనుకూలంగా కేంద్రాలుండాలని, ఆ దిశలో చర్య లు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ గోపాలరావు, కార్యదర్శి రాజులు పాల్గొ న్నారు.



మెళియాపుట్టి: వసుంధర చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఉయ్యాలపేట పోలింగ్ కేంద్రం..

నందిగాం: ఉయ్యాలపేట పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి సబ్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. కేంద్రంలో ఉండాల్సిన సదుపా యాలపై ఆరాతీసి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌వో నవజీవన్ రెడ్డికి సూచించారు.

ఎనర్జీ అసిస్టెంట్‌పై పోలీస్ అధికారి దాడి



టెక్కలి: టెక్కలి అయ్యప్పనగర్‌లో నివాసముంటున్న ఓ పోలీస్ అధికారి గురువారం విద్యుత్‌శాఖ ఎనర్జీ అసిస్టెంట్‌పై దాడికి పాల్పడినట్లు బాధితుడితో పాటు విద్యుత్‌శాఖ సిబ్బంది పేర్కొన్నారు. విద్యుత్ డీ లిస్ట్ బిల్లు బకాయి వసూలుకు వెళ్లి తిరిగి వచ్చిన తరువాత కొంత సేపటికి ఎనర్జీ అసిస్టెంట్ రాజ మహంతి సతీష్‌కుమార్‌కు స్టేషన్ నుంచి పిలుపు వచ్చింది. రాత్రి ఏడు గంటల సమయంలో ఏడీఈ కృష్ణమూర్తి, సిబ్బందితో పాటు ఎనర్జీ అసిస్టెంట్ సతీష్ కుమార్ స్టేషన్ రాగానే సదరు పోలీసు అధికారి పోలీసులతోనే పెట్టుకుంటావా అంటూ సతీష్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డారని విద్యుత్ సిబ్బంది తెలిపారు. రాత్రి 10 గంటల సమయంలో బాధితుడు జిల్లా కేంద్రాసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లాడు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ తమ్మినేని ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా డీ లిస్ట్ వసూలుకు వెళ్లిన ఎనర్జీ అసిస్టెంట్‌పై స్టేషన్‌లో దాడి జరిగినట్లు సమాచారం అందిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారన్నారు. ఎనర్జీ అసిస్టెంట్‌పై దాడి జరిగిన ఘటనపై సీఐ చంద్రమౌళి వద్ద ప్రస్తావించగా అటువంటిదేమీ జరగలేదని ఒకవేళ గాయపడితే వైద్యులు దెబ్బలు తగిలినట్లు సర్టిఫికేట్ చేస్తారు కదా అని అన్నారు.

ఘనంగా నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుక

పాతపట్నం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్ పుట్టిన రోజు వేడుకలను గురువారం పాతపట్నం బస్టాండ్ కూడలిలో నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల లక్ష్మయ్య, సైలాడ సతీష్, దువ్వారి ఉదయ్ భాస్కర్, వట్టి కన్నారావు, బుల్లిబాబు, ఇప్పిలి రాజా, కలమట భుజంగరావు, రుంకు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ఓటే వజ్రాయుధం

ఎల్.ఎన్.పేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, దీనిని సద్వినియోగం చేసుకుని మంచి ప్రభుత్వాలను ఎన్నుకోవాలని ఎంపీడీవో జి.గిరిబాల, తహసీల్దార్ రాణి అమ్మాజి కోరారు. మండల కేంద్రంలో గురువారం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఓటుహక్కు వినియోగం పై ప్రజలకు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఏపీఎం రవిరాజ్ పాల్గొన్నారు. ● **నరసన్న పేట:** సార్వత్రిక ఎన్నికల్లో నిజాయితీగా ఓటు వేయాలని, ఎటు వంటి ప్రలోభాలకు లొంగ వద్దని నరసన్నపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జీవీఎస్ఎస్ రామ్మోహన్ రావు అన్నారు. గురువారం జమ్ము గ్రామంలో ఓ ప్రైవేట్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కనకారావు, వీఆర్వోలు అప్పల నాయుడు, పీవీ రమణ పాల్గొన్నారు. ● **పాతపట్నం:** ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం మనోరత్నం అన్నారు. గురువారం వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య ప్రతినిధులతో ర్యాలీ నిర్వహించారు.

ఇన్విజిలేషన్‌లో అవకతవకలు సరిదిద్దాలి

టెక్కలి: పదో తరగతి ఇన్విజిలేషన్‌లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, వీటిని సరిదిద్దాలని మండల యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ డీఈవో, ఎంఈ వో కార్యాల యాల్లో ఫిర్యాదు చేశారు. ఇన్విజిలేషన్‌లో హెచ్ఎంలకు, స్కూల్ అసిస్టెంట్లకు మినహా యింపు ఉందని, దీనికి విరుద్ధంగా డ్యూటీలు వేశారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కొందరు ఉపాధ్యాయులు, వారి బంధువుల పిల్లలు పరీక్షలు రాస్తున్న కేంద్రాల్లోనే ఆయా ఉపాధ్యాయులను ఇన్విజిలేషన్‌కు వేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.దాలయ్య పి.గణపతిరావు, టి.వైకుంఠరావు, పాలవలస ధర్మారావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపోటా నూతన కార్యవర్గం ఎన్నిక

పలాసరూరల్: ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) పలాస మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. కాశీబుగ్గ ఒడియా ప్రాథమిక పాఠశాలలో కేంద్ర కమిటీ కన్వీనర్ నల్ల గోవిందరాజు పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా నల్ల నాగేశ్వరరావు, కార్యదర్శిగా నాగేశ్వరరావు పాత్రో, ఉపాధ్యక్షుడిగా దుర్గాప్రసాద్ మహంతి, సంయుక్త కార్యదర్శిగా ఎస్.జనార్దన, కోశాధికారిగా బాలాజీ పాత్రో, గౌరవాధ్యక్షులుగా ఖగేశ్వరదొర, లక్ష్మీనర్సింహ పండా, కార్యదర్శులుగా నీలకంఠ పాత్రో, చంద్రశేఖర బెహరా, విజయ పాణిగ్రాహి, మీనకేతన్‌లను ఎన్నుకున్నారు.

దుప్పి పిల్ల మృత్యువాత

టెక్కలి: విదేశీ పక్షుల విడిది కేంద్రమైన తేలినీలా పురంలో గురువారం ఓ దుప్పి పిల్ల మృత్యువాత పడిం ది. వారం రోజుల కిందట రాంపురం, జయపురం గ్రామా ల సమీపంలో తెట్టంగి పంట పొలాల్లో ఇరు క్కున్న దుప్పిని గ్రామస్థుల సహాయంతో అటవీశాఖాధి కారులు పట్టుకొని సంరక్షణ నిమిత్తం తేలినీలాపురం తరలిం చారు. అయితే అటవీశాఖ అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గురువారం మృత్యువాత పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుప్పి కళేబరానికి అటవీశాఖ అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు.

ముందస్తు పరీక్షలపై ఫిర్యాదు

టెక్కలి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ముందస్తుగా ఎఫ్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తుండడంపై ఏబీవీపీ రాష్ట్ర కౌన్సిలర్ కొన్ని మురళి గురువారం మండల విద్యాశాఖాధి కారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యాశాఖాధికారులు పాఠశాలను సందర్శించి పరీక్షలను నిలుపుదల చేయించారు. నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు మదన్, ఆర్య శ్యామ్, అరవింద్ పాల్గొన్నారు.

చిరస్మరణీయం అప్పలసూరి పోరాటం

నరసన్నపేట: రైతులు, రైతు కూలీల సమస్య పరిష్కారం కోసం మామిడి అప్పల సూరి చేసిన పోరాటం చిరస్మరణీయమని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి అన్నారు. విప్లవ పోరాట యోధుడు మామిడి అప్పలసూరి 27వ వర్ధంతి కార్యక్రమం కోమర్తిలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, ప్రజాసంఘాల నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, నేతింటి నీలంరాజు, గొరకల బాలకృష్ణ, డి.గణేష్, క్రాంతి, రవి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలను ఓటు బ్యాంకు గానే చూస్తున్నారు

కాశీబుగ్గ: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పాలకులు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆయా సంఘాల నేతలు అన్నారు. గురువారం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జిల్లా లీగల్ అడ్వయిజర్ జీఎంఎఫ్ అనిల్ రాజ్ ఆధ్వర్యంలో అయా సంఘాల నేతలు విలేకరులతో మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గంలో మా వర్గాలకు 35 వేల ఓట్లు ఉన్నాయని, అయితే గతం నుంచి నేటి వరకు పాలకులు చేసిందేమీలేదన్నారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీచేసి మా సత్తా నిరూపిస్తామన్నారు. సమావేశంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి గంజి ఆర్ ఎజ్రా, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి అబ్రహం, బిషప్ సుందర్ సింగ్, ఎస్.డేనియల్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య


జమున(ఫైల్)

కవిటి: మాణిక్యపురం గ్రామానికి చెందిన జమున బిసాయి(43) తన ఇంట్లో బుధవారం రాత్రి ఉరివేసుకొని మృతి చెందినట్టు ఎస్ఐ రాము తెలిపారు. కృష్ణచంద్ర బిసాయికి మూడో కుమార్తె అయిన జానకి బిసాయి అవివాహిత. ఒంటరిగా ఉన్నానని తరచూ బాధపడుతూ ఉన్న ఆమె ఇటీవల కొత్తగా గృహనిర్మాణానికి పూనుకొంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి కొత్త గృహానికి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జమున అన్న దేవరాజు బిసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


కృష్ణమూర్తి(ఫైల్)

కంచిలి: మఖరాంపురం జంక్షన్ వద్ద విద్యుదాఘాతంతో బొగియా కృష్ణమూర్తి(44) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మఖరాంపురం జంక్షన్ వద్ద గురువారం మధ్యాహ్నం ఆటోకు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి పడిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం సోంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై మృతుని భార్య బొగియా ఢిల్లేశ్వరి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా కృష్ణమూర్తికి భార్య ఢిల్లేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన కృష్ణమూర్తి ఆటోలకు సీట్స్, సీలింగ్, వెల్డింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్దదిక్కుని కోల్పోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

దిగబడిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం

పొందూరు: రైల్వే స్టేషన్ సమీపాన రోడ్డు ప క్కన ఓ లారీ బురదలో దిగబడింది. దీంతో ఆ ప్రాం తంలో ట్రాఫిక్‌కు తీవ్ర అం తరాయం ఏర్పడింది. వైసీపీ పాలనలో రోడ్ల దుస్థితికి అద్దం పడుతోందని స్థాని కలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి రోడ్డుకు అడ్డంగా ఇరుక్కోవడంతో ద్విచక్ర వాహనదారు లు సైతం ఇబ్బందులు పడ్డారు. జేసీబీతో లారీని బురద నుంచి తీయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


మట్టిలో కూరుకుపోయిన లారీ

గుర్తుతెలియని కళేబరం గుర్తింపు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం విశ్వనాథపురం పంచాయతీ పరిధి కొండల ప్రాంతంలో గుర్తుతెలియని కళేబరాన్ని గుర్తించినట్టు కోటబొమ్మాళి ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు. కొన్ని రోజుల కిందట మృతి చెందిన ఆనవాళ్లను స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. గురువారం సాయంత్రం ఘటనా స్థలాన్ని పరిశీలించామని, పూర్తి వివరాలు సేకరిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ట్రిపుల్ ఐటీ ప్రతిష్టను ఇనుమడింపజేయాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ విజయకుమార్

ఎచ్చెర్ల: గేట్‌లో ప్రతిభ చూపిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వర్సిటీ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఆర్జీయూకేటీ వీసీ ఎం.విజయకుమార్ అన్నారు. నూజివీడు లో చదువుతున్న శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు గేట్‌లో మంచి ర్యాంకులు సాధించడంతో వారిని గురువారం ఆయన అభినందించారు. శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు గేట్‌లో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. ఊర నాగేంద్ర భాస్కరస్వామి 349 ర్యాంకు, కోమర్ల శ్వేతశ్రీ 1064, గొట్టిపల్లి ఉదయశంకర్ 1085 ర్యాంకులతో పాటు పలువురు విద్యార్థులు ర్యాంకులు సాధించడంపై వారిని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గోపాలరాజు, ఓఎస్డీ ఎల్.సుధాకర్‌బాబు, అకడమిక్ డీన్ దువ్వూరి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఎచ్చెర్ల: ప్రతి ఒక్కరి దైనందిత కార్యక్రమాల్లో భద్రతా ప్రమాణాలు అంతర్భాగం కావాలని శ్రీకాకుళం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ బి.రాంబాబు అన్నారు. 53వ జాతీయ భద్రతా భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ (అరిణాం అక్కివలస)లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పరిశ్రమలో ఏర్పాటు చేసిన భద్రతా ప్రమాణాలు, నూతన పరికరాల గురించి పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేట్ హెచ్‌పీడీ హెడ్ మణిప్రసాద్, డీజీఎంలు వర్మ, వి.గోవిందరావు, ఎన్విరాన్‌మెంట్ విభాగాధిపతి చిన్నాదొరై, పరిశ్రమ సేఫ్టీ మేనేజర్ ఎస్.మౌళీశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పరిశ్రమ సిబ్బంది ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే పరిసర గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు భద్రతపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.


మాట్లాడుతున్న రాంబాబు

వ్యక్తిగత దూషణలు చేసిన వారిపై చర్యలు తీసుకోండి


ఎస్పీని కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం క్రైం: సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీతో పాటు మా పార్టీ నాయకుల వ్యక్తిగత జీవితాలపై అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధికను కలిసి పరిస్థితిని వివరించారు. ఈ నెల 21న ఓ వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌గా ఉన్న వ్యక్తి పేరుతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు పై తప్పుడు ఆరోపణలు చేస్తూ పోస్టు పెట్టారని ఎస్పీకి వివరించారు. కుల దూషణతో పాటు అసత్య ఆరోపణలు చేసిన ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు తదితరులు ఎస్పీని కోరారు. ఈయనతోపాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణ్‌రావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చింతా డ దిలీప్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోత మధుసూదన్‌రావు, పార్టీ ఎస్సీ సెల్‌జిల్లా అధ్యక్షుడు కొర్రాయి ప్రసాదరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

వమరవల్లిలో పోలీసు కవాతు

గార: ఎన్నికల నేపథ్యంలో గార మండలం వమరవల్లిలో గురువారం సాయంత్రం ఎస్ఐ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు దళం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

వైసీపీ అంతమే అందరి లక్ష్యం కావాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


ఆమదాలవలస: తోటాడ గ్రామంలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

ఆమదాలవలస: దేశ చరిత్రలో ఐదేళ్ల చేతకాని పాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేసిన వైసీపీని అంతమొందించడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని తోటవాడ, అక్కివరం, గోపీనగర్, కొత్తరోడ్డు ప్రాంతాల్లో నిర్వహించిన సూపర్‌సిక్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ప్రభుత్వ ఏర్పాటుతో రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ పేడాడ రామ్మోహన్, నాయకులు నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, హనుమంతు బాలకృష్ణ, బెండి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


సోంపేట: రుషికుద్దలో ఎమ్మెల్యే అశోక్ ప్రచారం

రానున్నది టీడీపీ ప్రభుత్వమే


గార: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

గార: రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. మండలం కె.మత్స్యలేశంలో గురువారం స్థానిక నేత జేసీ దేవదాస్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల, అభిమానుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. అనంతరం మదీనా దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎల్.రాధాకృష్ణ, పి.కృష్ణమూర్తి, కె.బాడిరాజు, ఇప్పిలి శివ, ఉప సర్పంచ్ లక్ష్మి, కామేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రుషికుద్దలో ప్రచారం

సోంపేట: రుషికుద్ద గ్రామంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన పార్టీ నాయకులు దాసరి రాజు, లోళ్ల రాజేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ చంద్రమోహన్, నిట్ట గోపాల్, సంధి జానకిరావు, తెప్పల హరినాథ్, ఢిల్లేష్, నాగల జయరావు, కర్రి తాతారావు, తెప్పల జానకిరావు తదితరులు ఉన్నారు.

చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అమ్మకాలు, ఎక్కడైనా ఎక్కువ మోతాదులో నిల్వ చేసిన అక్రమ మద్యంపై ఎక్సైజ్, సెబ్ కలిసి తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎచ్చెర్లలో ఉన్న ఏపీఎస్బీసీఎల్ డిపో నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లకు మద్యం ఏ విధంగా సరఫరా చేస్తున్నారు, వాహనాల జీపీఎస్, రూట్ మేప్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. షాపులను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. షాపుల్లో రోజువారీ రిజిస్టర్లు మెయింటైన్ చేస్తున్న దీ లేనిదీ పరిశీలించారు. ఒక వ్యక్తికి మూడు బాటిళ్లు మాత్రమే అనుమతిస్తున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వివరించారు. రణస్థలం మండలం బంటుపల్లి వద్ద గల యునైటెడ్ బేవరేజస్‌లో తయా రవుతున్న బీరుపై ఆరా తీశారు. బయటి జిల్లాల నుంచి, పక్క రాష్ట్రాల నుంచి మద్యం జిల్లాకు తరలిరాకుండా నిఘా పెంచాలని సూచించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, సెబ్ జేడీ గంగాధరం, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు, యునైటెడ్ బేవరేజస్ డిస్టిలరీ అధికారి ఎంఆర్‌కే దాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఓటింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

కలెక్టరేట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల శిక్షణ బృందం అధికారులు ఎం.కిరణ్‌కుమార్, బాలాజీ నాయక్, శేషగిరి సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వీరు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్ వినియోగంపై ఎన్నికల అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ.. పోలింగ్ ప్రారంభానికి ముందు, పోలింగ్ పూర్తయిన తర్వాత ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణలో ఓటరు స్లిప్స్, ఫారం 17ఏ, 17-బీ, 17-సీ, 14, 14-ఏ, ఎం-21 మాక్‌పోల్ సర్టిఫికెట్, డిక్లరేషన్ ఫారాలు పూరించడంపై ప్రయోగత్మక శిక్షణ అందించారు. కార్యక్రమంలో డిస్పాచ్ సెంటర్‌లో కార్యకలాపాలు, పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు, పోలింగ్ ప్రారంభం, క్లోజర్ ప్రొటోకాల్స్, పోలింగ్ అనంతరం యంత్రాల సీలింగ్, మెటీరియల్ సీలింగ్, ఈవీఎం, వీవీ ప్యాటల్ నిర్వహణపై చర్చించారు. శిక్షణ కార్యక్రమంలో 130 మంది ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

రిజర్వు స్థలాలకు గోడలు నిర్మించండి

శ్రీకాకుళం రూరల్: నగరపాలక సంస్థకు చెందిన రిజర్వు స్థలాలను కాపాడుకునే దిశగా సరిహద్దు గోడ నిర్మించాలని కమిషనర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కార్పొరేషన్ పరిధిలోని కిల్లిపాలేం, చాపురం-2, మేజర్స్ కాలనీ, విశాఖ-ఏ కాలనీలో కమిషనర్ అన్సారియా పర్యటించి నీటి పారుదల, పారిశుధ్య సమస్య, రోడ్డు పనులను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ వెంకట్రావు, ఇంజనీర్ సుగునాకర్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ చెక్‌పోస్టు మూసివేత

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ చెక్‌పోస్టులు ఎత్తివేశారు. అందులో భాగంగా పురుషోత్తపురం వద్ద ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టును మూసివేశారు. 2017 వరకు వాణిజ్య, ఫారెస్ట్, సివిల్ సప్లై ఎక్సైజ్ శాఖలు ఉండేవి. కేంద్ర ప్రభుత్వం 2017లో అన్ని శాఖలను ఆ ఏడా జూలైలో ఎత్తివేసింది. అప్పటి నుంచి ఒక్క రవాణా శాఖ మాత్రమే దీన్ని నిర్వహించేది. ఇప్పుడు రవాణాశాఖ చెక్‌పోస్టును కూడా ఎత్తివేయడంతో ఆ ప్రాంతం నిర్మానుష్యంగా మారిపోయింది.

ముద్రణల వివరాలు తెలియజేయాలి


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నాయకులు రాజకీయ ముద్రణలు వేస్తే వాటి వివరాలు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటింగ్ ప్రెస్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు ముద్రించినప్పుడు ప్రింట్, పబ్లిష్‌కు సంబంధించిన పేరు, చిరునామా లేకుండా ముద్రించొద్దన్నారు. పోస్టర్లను ముద్రించేటప్పుడు వాటికి సంబంధించిన నాలుగు ప్రతులు ముందస్తుగా నోడల్ అధికారికి, మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనటరింగ్ కమిటీ డీపీఆర్‌వో కార్యాలయానికి (శ్రీకాకుళం) సమర్పించాలని తెలిపారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రింటింగ్ యజమానులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షురాలికి అభినందన


విజయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: స్థానిక సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా మూడోసారి ఎన్నికైన కణితి విజయలక్ష్మీ బాయిను గురువారం ఘనంగా సన్మానించారు. కోర్టు ఆవరణలో నిర్వహించిన సన్మాన కార్యక్రమాన్ని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్.మణి ముఖ్యఅతిథిగా హాజరై విజయలక్ష్మీబాయితో పాటు శ్రీకాకుళం మహిళా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టిన చింతాడ సత్యనారాయణను అభినందించారు. కార్యక్రమంలో ఏజీపీ సీపాన గోవిందరావు, సీనియర్ న్యాయవాదులు సాధు ధనుంజయ్‌రావు, పైడి వరహానరసింహం, బి.సీతారాం, తమ్మినేని అన్నంనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కె.వెంకటరాజు లక్ష్మి పాల్గొన్నారు.

108 మందితో కుంకుమ పూజలు



ఇచ్ఛాపురం: డబ్బీరి వీధి పరిధి 7, 8 వార్డుల జంక్షన్‌లో కొలువుతీరి ఉన్న దక్షిణ కాళీకామాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం 108 మంది మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు తెన్నేటి తేజేశ్వరశర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారికి 36 హారతుల ఇచ్చారు.

కోడ్ అమలులో వివక్ష

ఇచ్ఛాపురం: ఎన్నికల కోడ్ ఇచ్ఛాపురం మున్సిపాల్టీ, మండల పరిధిలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. లొద్దపుట్టి తులసమ్మగుడి ఎదురుగా ఉన్న పైలాన్‌పై జగన్, వైఎస్ఆర్ ఫొటోలు కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జగన్ ముఖానికి ప్లాస్టర్ వేశారు. అయినా జగన్ ముఖం స్పష్టం గానే కనిపిస్తుంది. ముఖ్యంగా అధికార వైసీపీకి చెందిన ఫ్లెక్సీలు తొలగింపులో ఎన్నికల అధికారులు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


వైఎస్ఆర్, జగన్ బొమ్మలతో పైలాన్

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

పొందూరు: పర్యావరణాన్ని పరిరక్షించే అడవుల సంరక్షణ అందరి బాధ్యతని తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.గోపాలరావు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో అడవుల సంరక్షణ, యువత పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా చెట్టు ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చెట్టు ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

వైభవంగా ఉమాకామేశ్వర స్వామి కల్యాణం

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో ఉన్న ఉమాకామేశ్వరస్వామివారి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బంకుపల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పార్వతీసమేత ఉమాకామేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయ ఆవరణలో అన్న సమారాధన చేశారు. పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టుసాధించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉదయలక్ష్మి

పొందూరు: జాతీయస్థాయి ఉద్యోగాలతో పాటు ఐటీ రంగంలో ఉన్నత ఉద్యోగాలు సాధించాలంటే మాతృ భాషతో పాటు ఇంగ్లీష్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్‌లో యువత పట్టు సాధించాలని పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయలక్ష్మి అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కళాశాల విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధించడానికి కళాశాల ఆంగ్ల అధ్యాపకులు ఎం.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌రోయిచ్ యువర్ ఇంగ్లీష్ స్పీకింగ్ అనే 45 రోజుల ప్రత్యేక సర్టిఫికేట్ కోర్సు ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కోర్సుతో ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్స్ సాధించవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, జీకే వాసుదేవరావు, కె.సూర్యారావు, డి.రవి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

ఇచ్ఛాపురం: సన్యాసిపుట్టుగ గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి, పద్మనాభం, డి.కామేష్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న టీడీపీ నేతలు

ఓటు హక్కు వినియోగించుకోండి

ఆమదాలవలస: ఓటే వజ్రాయుధమని క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం నెల్లిపర్తి, తురకపేట, కొరపాం, జీకే వలస, మునగవలస, రామచంద్రాపురం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కూర్మారావు మాట్లాడుతూ వయోజనులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

- **ఇచ్ఛాపురం:** ప్రతీ గ్రామంలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని సంఘ ప్రతినిధులకు ఏపీఎం సనపల ప్రసాద్ సూచించారు. గురువారం వెలుగు కార్యాలయంలో సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఐదు యాప్‌లు యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ ఎలా డౌన్‌లోడ్ చేయాలో అవగాహన కల్పించారు.

ఆర్థిక స్తోమతలేని ఖైదీలకు లీగల్ సహాయం


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట: ఎటువంటి ఆర్థిక స్తోమత లేక సరైన న్యాయం పొందలేక క్రిమినల్ కేసుల్లో ఇరుక్కొని జైలులో మగ్గుతున్న ఖైదీలకు ఉచితంగా లీగల్ సహాయం అందించేందుకు జిల్లా న్యాయస్థానంలో లీగల్ సెల్ ఏర్పాటు చేసిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. గురువారం జిల్లా కోర్టుల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ సూచనల మేరకు గతేడాది అక్టోబర్ నుంచి ఈ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు జి.ఇందిరా ప్రసాద్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ధరల అదుపు

పొందూరు: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు ధరలు అందుబాటులోకి వస్తాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడి నాభూషణ్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియా కూటమిలో ప్రధాన పార్టీ అయిన డీఎంకే ప్రభుత్వం తమిళనాడులో పెట్రోల్‌ను రూ75, గ్యాస్‌ను రూ.500 అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వ హామీలను నమ్మి మోసపోయిన రాష్ట్ర ప్రజలను ఆదుకోవాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే గెలిపించాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, ప్రత్యేక ప్యాకేజీతో పాటు పోలవరం పూర్తి చేయడమే కాకుండా విభజన హామీలన్నింటిని నెరవేరుస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి విజయం చేకూర్చాలన్నారు.

గైర్హాజరైన సిబ్బందికి నోటీసులు

ఎచ్చెర్ల: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామ సచివాలయాలను గత రెండు రోజులుగా ఎంపీడీవో టి.రమాదేవి సందర్శించి పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా కుప్పిలి, బుడగట్లపాలెం సచివాలయాలను సందర్శించగా.. పలువురు సిబ్బంది ఎలాంటి అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా విధులకు హాజరుకాలేదని ఆమె గుర్తించారు. అలాగే ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్ పురం సచివాలయాల్లో ఇద్దరేసి వంతున ఉద్యోగులు విధులకు హాజరుకాలేదని గుర్తించారు. దీనిపై వీరందరికీ ఒక్క రోజు వేతనం ఎందుకు నిలుపుదల చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో సీనియర్ సహాయకులు కె.నారాయణరావు సిబ్బంది పాల్గొన్నారు.

కుదిరిన ఒప్పందం

ఎచ్చెర్ల: నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ (అరిణాం అక్కివలస) యాజమాన్యానికి, కార్మికులకు వేతన ఒప్పందం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (విశాఖ) సమక్షంలో గురువారం కుదిరినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి 2022 సెప్టెంబరుతో వేతన ఒప్పందం ముగియడంతో నూతన వేతన ఒప్పందం కోసం పరిశ్రమ యాజమాన్యానికి సీఐటీయూ అనుబంధ వర్కర్స్ యూనియన్ ఛార్టర్స్ ఆఫ్ డిమాండ్స్‌ను అందజేసిందన్నారు. ప్రస్తుతం జరిగిన ఈ వేతన ఒప్పందం 2025 సెప్టెంబరు 30వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం: డబ్బూరివీధిలో కొలువుతీరి ఉన్న దక్షిణ కాళీమాత ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు. గురువారం ఆలయంలో కాళీమాతకు మర్దన స్నానం, పూర్ణాహుతి అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి మహానైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

అడవులతోనే మానవాళికి రక్షణ

శ్రీకాకుళం స్పోర్ట్స్: మానవ మనుగడకు చెట్లు ఎంతో ఉపకరిస్తాయని నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈవో చెంచులావు సింహాచలం మాట్లాడుతూ.. ఆక్సిజన్ సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో నివసించే వారి ఆయువు.. ప్రమాణాలు గణనీయంగా పెరగడానికి దోహదం చేస్తాయన్నారు. ఆడవులు బాగుంటే మానవాళికి రక్షణ కవచాలుగా పనిచేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, ఎస్.జోగినాయుడు, బీవీ రవిశంకర్, కార్యదర్శి బి.దేవీప్రసాద్, ప్రశాంత్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.